మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి

ఆదివారం 17 మార్చి 2024
పేజీలు 8

## పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్




**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అధికా రులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడిన తర్వాత రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టరోల్ అధికారి వికాస్ రాజ్, డి.జి.పి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణ పై దిశా నిర్దేశం చేయ గా అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి గురుతర బాధ్యతను వివరించారు. ప్రతినోడల్‌అధికారి తమ బృందాలను సిద్ధం చేసుకోవాలని ఈ రోజు నుండి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్విలియన్స్ టీమ్‌లు తమ బాధ్యతలు పకడ్బందీగా నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో లైసెన్స్ పొందిన ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కొత్త వాటికి అనుమతులు ఉండవని, ఇప్పటికే ఉన్నవాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి, అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్, అదనపు కలెక్టర్ యం. నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### హరితహారం లక్ష్యాన్ని సాధించేందుకు

# సిద్ధం కావాలి

### - జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** వచ్చే రెండు సంవత్సరాలకు అను గుణంగా హరితహారం కార్యక్రమంలో భాగం గా మొక్కలు నాటడా నికి వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అన్నారు. శనివారం నాడు కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో ఆయన సంబంధిత శాఖల అధికారులతో హరితహారం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే 2025, 2026 రెండు సంవత్సరాలకు గాను హరితహారంలో 17 లక్షల 50 వేల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. రాబోయే జూన్, జూలై మాసాలలో వర్షా కాలంలో వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, చెరువు కట్టలు, రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్ తదితర ప్రాంతాలలో మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన సూచించారు. అవసరాలకు అనుగుణంగా నర్సరీలలో అవసరమైన మొక్కలను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నర్సింగరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎం. ఏ. అక్బర్, గద్వాల మున్సిపల్ కమిషనర్ శంకర్ సింగ్ పాల్గొన్నారు.

### అవినీతిపై పోరాటంలో

# అండగా ఉండండి

- గోతిలోనుండి నూతిలో పడ్డ తెలంగాణా ప్రజలు
- దళిత బంధుపేరుతో కంట్లో దుమ్ముకొట్టిన కెసిఆర్
- సామాజిక న్యాయం పేరుతో కాంగ్రెస్ మోసం
- షెడ్యూల్ కన్నా ముందే బిజిపి విజయం నిర్ధారణ
- మోది సభకు జనసమీకరణ అంతంతే



నాగర్‌కర్నూల్ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోది

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మేజర్‌న్యూస్:** పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోది నాగర్‌కర్నూల్‌లో భహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో మోది తన ప్రసంగం యావత్తు కాంగ్రెస్ నినాదమైన ఆరు గ్యారంటీలకు ధీటిగా మోది గ్యారంటీ అంటూ తను ప్రధానిగా కేంద్రంలోని బిజిపి పాలనలోచేస్తున్న అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా వివరిస్తూ ఇదీ మోది గ్యారంటీఅంటూపదే పదే తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ బిఆర్ఎస్‌లపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నట్లు టివిల్లో వార్తలు వస్తున్నాయని ఐతే తెలంగాణా ప్రజలు ఎంతో ఉత్సాహంగా తనరోడ్ షోతోపాటు సభల్లో పాల్గొంటూ బిజెపి విజయం ఖాయంఅని నిర్ధారించారని అన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల అభ్యర్థులతోపాటు నలగొండ పార్లమెంటు



పార్లమెంటు అభ్యర్థులను పరిచయం చేస్తున్న ప్రదాని

మిగతా 2లో

## నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం

### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్ నగర్, మేజర్ న్యూస్ :** నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 100 రోజల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తి అయిన సందర్భంగా శనివారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ప్రతి క్షణం కృషి చేస్తానని ఆయన చెప్పారు. ప్రజా సమస్యలు ఏవి ఉన్నా వాటిని నా దృష్టికి తీసుకొని వేస్తే వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్ల లోపు వచ్చే వారికి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జీరో బిల్లు వస్తుందని, ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, గృహజ్యోతి పథకానికి మహబూబ్ నగర్ లో 10 వేల మంది, హన్వాడలో 7 వేల మంది, మహబూబ్ నగర్ మున్సిపల్ పరిధిలో 14662 మంది కి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు వస్తుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు విశ్వవిద్యాలయానికి రూసా నిధులు కింద 100 కోట్ల రూపాయలు తీసుకురావడం జరిగింది అని, గతంలో మన మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ మరియు లా విద్య అభ్యసించేందుకు తరలి పోతున్నారని, కానీ, ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని, విద్యాశాఖ కార్యదర్శిని

మిగతా 2లో

## రాత్రి సమయంలో యథేచ్ఛగా ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్ తరలింపు





**నవాబ్‌పేట మేజర్‌న్యూస్:** నవాబ్ పేట మండల పరిధిలోని ఇప్పటూర్ చౌటపల్లి కారూర్ మల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుక సరఫరా చేస్తున్నారు. శుక్రవారం రాత్రి సమయంలో లింగం పల్లి వద్ద అనుమతి లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ మీడియా ప్రతినిధికి కనపడింది. ఈ విషయం పై తహశీల్దార్ నాన్య నాయక్ దృష్టికి తీసుకెళ్లగా అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుక సరఫరా చేస్తున్న వారికి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాంటి వారు ఎంతటి వారైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై అభిషేక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్ తరలింపు వాహనాలను తనిఖీ చేసి తమ సిబ్బందితో గస్తీ తిరుగుతూ పట్టుబడ్డ వాహనాలను సీజ్ చేసి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమ ఇసుక సరఫరా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# వచ్చామా పోయమా...

### - నామ్ కే వాస్తిగా ప్లాట్ల రాళ్ళ తొలగింపు



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** గత రెండు రోజులుగా అక్రమ వెంచర్లపై సూర్య దినపత్రికలో వస్తున్న కథనాలు పాఠకులకు విధితమే. ఈ కథనాలకు స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం పట్టణంలోని కురుమిద్ద రోడ్డులో గల సాయి బాలాజీ ఫంక్షనల్ వెనకాల ఉన్న 746/ఈ/1 సర్వే నెంబర్ గల నాలుగు ఎకరాల వెంచర్ లో టౌన్ ప్లానింగ్ అధికారి విజయకుమార్, సిబ్బంది శ్రీకాంత్ వచ్చామా పోయమా అనే చందంగా నామ్ కే వాస్తిగా డోజర్ సహాయంతో ప్లాట్ల రాళ్ళ ను తొలగించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారికి చరవాణిలో వివరణ కోరగా స్పందించలేదు, ఈ అక్రమ వెంచర్ల పై మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో ప్లాట్ల రాళ్ళ ను తొలగించకపోవడంతో సార్వత్రా విమర్శలు గుప్పిస్తున్నాయి, గత ప్రభుత్వ నేతలు, కొందరు అధికారులు ఈ అక్రమ వెంచర్ల కు సహకరించారని విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి, గతంలో అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకున్నట్లయితే అక్రమాలు జరిగేవి కావని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు, 736/2బి, 736/4, 54/యు గల వెంచర్ల లో మున్సిపల్ అధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## అండగా ఉండండి

(మొదటిపేజీ తరువాయి)





అభ్యర్థి పరిధిలోని అభ్యర్థులు ప్రజలు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు ప్రకటించిన స్థాయిలో కార్యకర్తలను సమీకరించలేకపోయారు. వచ్చిన ప్రజలు కూడా సభాస్థలికి చేరుకోవడానికి ఇబ్బంది పడుతూ రోడ్డుపైనే ఉండిపోయారు. నాతెలంగాణా కుటుంభ సభ్యులందరికి నమస్కారాలు అంటూ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించిన అనంతరం మోది హిందీలో మాట్లాడుతూ...

***ఒక్క అవినీతి పరుదుకూడా తప్పించుకోలేడు..*** తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ 2జి కుంభకోణంలో ఇరుక్కుపోయిందని బిఆర్ఎస్ పార్టీ భూమాఫియా, ఇరిగేషన్, శాండ్ ఇతర అక్రమాలకు పాల్పడిందని మోది ఆరోపించారు. ఏఒక్క అవినీతి పరుదు కూడా తమనుండి తప్పించుకోలేడని తెలంగాణా ప్రజలకు తాను ఇస్తున్న గ్యారంటీ అన్నారు. అవినీతి అంతం పోరులో తెలంగాణా ప్రజలు తనకు అండగా నిలవాలని కూడా ప్రధాని విజ్ఞప్తి చేశారు. 23సంవత్సరాలు సిఎంగా పిఎంగా రాత్రి పగలు కష్టపడుతున్నానని తనకుటంభం కోసం కాకుండా దేశంలోని 140కోట్ల ప్రజలకోసం తాను నిరంతరం శ్రమిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ గరీబీ హఠాఓ నినాదం తెచ్చి ఆ నినాదంతో ఓట్లు దండుకుందే తప్ప ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాతే ఈ సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ దళితులకు విలువ ఇవ్వడంలేదని ఆవర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రిని కిందకూర్చోబెట్టిన ఫోటోలు మీరంతా చూసే ఉంటారని మోది గుర్తు చేశారు. ఇక దళిత బంధు పేరుతో దళితుల కంట్లో దుమ్ముకొట్టారని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై విమర్శలు గుప్పించారు. తెలంగాణాలో తొలి ముఖ్యమంత్రి దళితుడే అన్న మాట తప్పారని గుర్తు చేశారు. దక్షిణ భారత దేశానికి ముఖ ద్వారమైన తెలంగాణాలో కాంగ్రెస్ బిఆర్ఎస్‌లు కల్సి అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందకుండా చేశాయని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అందుకు ఫలితం అనుభవించిందని ఐతే గోతిలోనుండి నూతిలో పడ్డట్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధిని సర్వనాశనం చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ బిఆర్ఎస్ ఆటలు సాగకుండా చేయాలంటే తెలంగాణాలోని 17పార్లమెంటు స్థానాలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

***బిజెపి అభ్యర్థుల పరిచయం..*** సభావేదికపైనుండి నాగర్‌కర్నూల్ అభ్యర్థి పి.భరత్ ప్రసాద్, మహబూబ్‌నగర్ అభ్యర్థి డికె అరుణ, నల్లగొండ అభ్యర్థి సైది రెడ్డిలను ప్రధాని మోది పరిచయం చేశారు. సభకు బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అధ్యక్షత వహించగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపి రాములు, రాష్ట్ర, జిల్లా బిజెపి నేతలు పాల్గొన్నారు.

## లోకసభ అభ్యర్థి భరత్ బుద్ధారం గండిలో పూజలు



**గోపాలపేట మేజర్‌న్యూస్:** బిజెపి పార్టీ లోకసభ అభ్యర్థి భరత్ శనివారం మండల పరిధిలోని బుద్ధారం గండి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమను గెలిపించాలని ఆంజనేయస్వామి కృప ఆశీర్వాదం కావాలని కోరుకున్నట్లు తెలిపారు ఆయన వెంట వనపర్తి జిల్లా చైర్మన్ లోకనాథ్ రెడ్డి అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జన్మదిన వేడుకలు



**దేవరకద్ర మేజర్ న్యూస్ :** దేవరకద్ర మండల టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మున్నూరు బాలరాజు జన్మదిన వేడుకల సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ లో తెరాస మండల నాయకులు వారిని సాలువ తో సత్కరించి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

మహబూబ్‌నగర్‌లో లా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల ఆవశ్యకత గురించి వివరించి, మహబూబ్ నగర్ జిల్లా విద్యార్థులకు అందుబాటులో ఇంజనీరింగ్, లా కళాశాలను పాలమూరు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయుటకు ఒప్పించడం జరిగింది అని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లాను కేవలం ఒక విద్యలో నే కాకుండా, స్కిల్ డెవలప్మెంట్‌లో కూడా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 20 కోట్ల రూపాయలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలియజేసారు. వృత్తి, సాంకేతిక విద్యఅభివృద్ధికి రెండు ఐటిఐ కళాశాల లకు 7.7 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆయన చెప్పారు. అమృత్ పథకం కింద మహబూబ్‌నగర్ జిల్లాలో 216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని పూర్తి చేయుటకు కేంద్ర ప్రభుత్వ నిధులు 70శాతం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 30శాతం తో పూర్తి చేస్తాం అని ఆయన తెలిపారు. ఉర్దూ ఘర్ ఐదు అంతస్థుల భవన నిర్మాణం చేయుట కోసం 15 కోట్లు, షాదిఖాన 25 కోట్లు ఆలాగే మౌలాలి గుట్ట దగ్గర అన్ని మతాల వారికి సంబంధించిన స్మశాన వాటికల కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే చనిపోయిన వారి అంతిమ యాత్ర కోసం, చనిపోయిన వారి భౌతిక దేహాన్ని తరలించేందుకు ఎస్డిఎఫ్ నిధులనుంచి రెండు వాహనాలు ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. స్మశాన వాటిక వరకు రోడ్ అలాగే బోర్ వెల్, షెడ్ నిర్మాణం కూడా చేస్తామని ఆయన తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి వస్తె ఎందరినో గృహనిర్బంధం చేసేవారని, కొందరు పత్రికా విలేఖరులను సైతం గృహనిర్బంధం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కానీ, పార్టీలకు అతీతంగా మా ముఖ్యమంత్రి వచ్చినప్పుడు వారిని పరిచయం చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామని ఇప్పుడు ఉన్నది ప్రజాస్వామ్య ప్రభుత్వం అని, ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం అని ఆయన స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా ఎవరు ఏ పనులు చేసినా సహించమని, అందుకు మేము సిద్దంగా లేమని , ప్రభుత్వ భూములలో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. వచ్చే 20,25 సంవత్సరాలకు ఏఏ అభివృద్ధి పనులు మహబూబ్ నగర్ జిల్లా లో కావాలో వాటికోసం పనిచేయడమే మా పని అని, అంతే కానీ, భూమి పంచాయతీ, ఉద్యోగాలు అంటూ రావద్దు అని ఆయన చెప్పారు. పాలమూరు విశ్వవిద్యాలయం దగ్గర 33/11 సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తాం అని ఆయన చెప్పారు. కుల సంఘాల భవనాలు నిర్మాణాలను స్వాగతిస్తానని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరు నిర్మాణం చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రతి రూపాయి ఉపయోగపడితే రూపాయి విలువ పెరుగుతుంది అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సిజె బెనహర్, సాదుతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయన్ని అందించిన ఎంపీడీవో శ్రీధర్



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కాన్ కుర్తి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు శుక్రవారం గుండె పోటుతో మృతి చెందడం జరిగింది అట్టి కుటుంబాన్నికి మండల ఎంపీడీవో శ్రీధర్ తనవంతు సహాయంగా శనివారం 10 వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## కూతురు సంసారానికి పోతలేదని తండ్రి ఆత్మహత్య

**నవాబ్‌పేట మేజర్‌న్యూస్:** కూతురుసంసారానికి పోతలేదని తండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటనకూచూరు గ్రామంలో చోటు చేసుకుంది.సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి కూచూరు గ్రామానికి చెందిన బ్యాగరి హన్మంతు(46) పెద్దకూతురు అయిన సోనియాని పెద్దదరిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కు ఇచ్చి వివాహం చేయగా సంసారం చేయకుండా తల్లిదండ్రుల దగ్గరే ఉంటుందని భర్త శ్రీనివాస్ కూచూరు గ్రామానికి వచ్చి పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పించి సోనీని గత మూడు రోజుల క్రితం 14వ తేదీన తీసుకు పోదామని రాగా సోనీ శ్రీనివాస్ తో సంసారానికి పోనని చెప్పడంతో తండ్రి హన్మంతు తీవ్ర మనస్తాపం చెంది శుక్రవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు అతని భార్య బ్యాగరి జంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.తన భర్త మృతి పై ఎలాంటి అనుమానం లేదు అని. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిషేక్ రెడ్డి తెలిపారు.

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు : రూ.4.83.085 ఆదాయం

**చిన్న చింతకుంట, మేజర్ న్యూస్ :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి హుండీనీ శనివారం లెక్కించారు. స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం కానుకల రూపేనా హుండీలో వేసిన నగదును ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, ఆలయ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో హుండీ నీ లెక్కించగా రూ 4.83.085 ల ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి ,ఆలయ అర్చకులు , సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## మోడీ సభకు తరలిన బిజెపి శ్రేణులు



**లింగాల,మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలో శనివారం బిజెపి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విజయ సంకల్ప సభ కు లింగాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి బిజెపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బిజెపి నిర్వహించిన ఈ సభ లో ప్రధానిగా నరేంద్ర మోడీ తొలిసారిగా నాగర్ కర్నూల్ కి వచ్చి బహిరంగ సభలో ప్రసంగాన్ని ఆసక్తితో తిలకించేందుకు పార్టీలకు అతీతంగా నరేంద్ర మోడీ అభిమానులు బిజెపి శ్రేణులతో కలిసి లింగాలలో భారీ ర్యాలీ నిర్వహించి వివిధ వాహనాలలో సభకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అప్పాపూర్ చెంచుపెంట మాజీ సర్పంచ్ బాల గురువయ్య, విష్ణు చారి, నవీన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో రెండు గంటల విద్యుత్ అంతరాయం

**నారాయణపేటటౌన్ మేజర్‌న్యూస్:** నారాయణపేట పట్టణంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు ఉప విద్యుత్ కేంద్రంలో 11. కె.వి. ఫీడర్ మరమ్మత్తు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహమ్మద్ రఫీ తెలిపారు. సత్యసాయి ఫీల్డర్ కింద పర్మారెడ్డి కాలనీ, అశోక్ నగర్, బాబా కాలనీ, బి.సి. కాలనీ న్యూ గంజ్ , సివిల్-2 కింద కలెక్టర్ బంగ్లా, ఎస్పీబంగ్లా, ఆర్.టి.సి. కాలనీ , సత్యసాయి కాలనీ, టిచర్స్ కాలనీలు ఉంటాయి. సివిల్ -1 ఫీడర్ పరిధిలో బస్సు డిపో సావిజయ్ కాలనీ, సింగార్ బేస్ కాలనీ, సరాఫ్ బజార్, దర్గా ఏరియా, కుమ్మరి వాడి, దామరగిద్ద రోడ్ వస్తాయి, యాదగిరిరోడ్ ఫీడర్‌కింద మ్యాదర్ వాడి,పళ్ల, ప్రభుత్వ ఆసుపత్రి, బహార్‌పేట, శివాజీనగర్, మహాకాళి విధి లు ఉన్నాయి. అలాగే చిన్న పిల్లల ఆసుపత్రి ఫీడర్ కింద పాత బస్టాండ్, మనోహర్ థియోటర్ తదితర ప్రాంతాలు వస్తాయి కావున విద్యుత్ వినియోగ దారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## 19న బిజెపి కోర్ కమిటీ ఎలక్షన్ సమావేశం



**మహబూబ్‌నగర్ అర్బన్ మేజర్‌న్యూస్:** శనివారం బిజెపి మహబూబ్నగర్ పార్లమెంటు ఎన్నికల పార్టీ కార్యాలయంలో పార్లమెంటు కన్వీనర్ పవన్ కుమార్ అధ్యక్షతన పార్లమెంటు ముఖ్యమైన నాయకుల యొక్క సమావేశం నిర్వహించారు. మార్చి 19న పార్లమెంటు కోర్ కమిటీ పార్లమెంటు ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ సమేశాలు మహబూబ్నగర్ హెడ్ కోటర్ లో ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. అసెంబ్లీ వైజ్ గా కోర్ కమిటీలు అసెంబ్లీ లో పార్లమెంట్ ఎన్నికల పార్టీ కార్యాలయాలు ప్రారంభం సంస్తాగత విషయాల పైన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాలమెంటు అభ్యర్థి డీకే అరుణ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, పార్లమెంటు ప్రబారి కెవిఎల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి కొండయ్య ,పడకుల బాలరాజు, దేవరకద్ర ఎమ్మెల్యే అభ్యర్థి కొండ ప్రసాద్, అసెంబ్లీల ప్రభారీలు రాజ వర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, సదానంద రెడ్డి , ఎ. అంజయ్య, పార్లమెంటు ఫుల్ టైమర్ కేతూరి బుడ్డన్న, సహితి రెడ్డి కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## హమ్మింగ్ బర్డ్స్ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు




**పాలమూరు మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలోని హమ్మింగ్ బర్డ్స్ పాఠశాల ఆధ్వర్యంలో పద్మావతి కాలనీ నేషనల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా తరగతులకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ నవీన్ కుమార్, ప్రిన్సిపల్ తేజోమై మాట్లాడుతూ తమ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలతో అధునాతన విద్యా విధానాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని,చదువుతో పాటు శారీరక మానసిక దృఢత్వం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిపిపి ఎస్ఏ జిల్లా అధ్యక్షులు మల్లేష్ ,ప్రధాన కార్యదర్శి అంజనేయులు, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలమారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ భాను ప్రకాష్, ప్రధాన కార్యదర్శి అనందరెడ్డి, బాలకృష్ణ ,రాంభూపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డీకే అరుణను ఎంపీగా గెలిపించుకుంటాం

### - అయోధ్య రాముడిని దర్శించుకున్న బీజేపీ మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ



**రాజాపూర్, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ తరపున మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను ప్రకటించడం పట్ల రాజాపూర్ మండల బిజెపి అధ్యక్షులు కావలి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. అరుణమ్మకు టికెట్ రావడం అభినందనీయమని ఆమెను ఎంపీగా గెలిపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తన జన్మదిన మహోత్సవం అలాగే అరుణమ్మకు టికెట్ రావడం పట్ల అయోధ్య బాల రాముడిని దర్శించుకున్నట్లు కావలి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కావలి రామకృష్ణ మాట్లాడుతూ అయోధ్య రామ్ లల్లా దర్శనం ఎన్నో జన్మల పుణ్యమని, బాల రాముని దర్శనంతో తన జన్మ ధన్యమైందని, దేశ ప్రధానిగా తిరిగి మోదీ రావాలని, డీకే అరుణమ్మ మహబూబ్ నగర్ ఎంపీగా గెలవాలని ఆ భగవంతుని కోరుకున్నట్లు కావలి రామకృష్ణ పేర్కొన్నారు. రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి నాయకులు ఉడిత్యాల సంతోష్ ముదిరాజ్‌తో కలిసి అయోధ్య బాల రాముడిని దర్శించుకున్నట్లు బిజెపి రాజాపూర్ మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ పేర్కొన్నారు.

## పీయూలో ఏప్రిల్ 6న జాతీయ సదస్సు

### - ఉపకులపతి ప్రొ లక్ష్మి కాంత్ రాథోడ్



**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్:** పాలమూరు యూనివర్సిటీ లో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న ఒక రోజు జాతీయ సదస్సు ఎమర్జింగ్ ఇండియన్ ఎకానమీ గ్రోత్ అండ్ ప్రాస్పెక్టస్ అనే అంశం పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఉపకులపతి లక్ష్మి కాంత్ రాథోడ్ తెలిపారు. జాతీయ సదస్సుకు సంబందించిన బ్రోచర్‌ను శనివారం పరిపాలన భవనంలో అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సదస్సుకుకీ నోట్ స్పీకర్‌గా డైరెక్టర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఎకనామిక్స్ ప్రొ టిఎల్ఎన్‌స్వామి, హైదరాబాద్ వారు రానునున్నారని, ఆరోజు దేశ నలుమూలల నుంచి స్కాలర్స్, అధ్యాపకులు పేపర్ ప్రెసెంటేషన్స్ ఇవ్వనున్నారని ఉపకులపతి తెలిపారు. ఈ కార్యక్రమం లో చైర్మన్ డా చంద్రకిరణ్, వైస్ చైర్మన్ డా కృష్ణయ్య, విభాగధిపతి %డ%కన్వీనర్ డా జిమ్మీ కార్టన్, అధ్యాపకులు డా వెంకట్ రాఘవేందర్, డా శివ లింగం, రాజు, డా అర్జున్ కుమార్, డా రవి కుమార్, డా శ్రీధర్ రెడ్డి, డా పర్వతాలు, డా ప్రభాకర్ రెడ్డి, డా శిలాస్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

## కురుమూర్తి సన్నిధిలో తపోవన్ పాఠశాల విద్యార్థులు



**దేవరకద్ర (కౌకుంట్ల) మేజర్‌న్యూస్:** డోకూర్ సమీపంలో గల తపోవన్ పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, కురుమూర్తి సన్నిధిలో పదవ తరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వారి హల్ టికెట్స్ ను కురుమూర్తి స్వామి పాదాల దగ్గర ఉంచి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పాటు పాఠశాల ప్రిన్సిపల్ వర్కుట్టి నిరంజన్ రెడ్డి మరియు చంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ధరూర్‌లో పోషణ్ పక్వాడ దినోత్సవం




**ధరూర్ మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని అంగన్ వాడి సెంటర్ మూడులో పోషణ్ పక్వాడ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని వండించి చూపించారు. గర్భిణీలు, బాలింతలు రక్తహీనత రాకుండా పోషక విలువల ఆహారంపై, చిరుధాన్యాల గురించి వివరించారు. ప్రతి ఒక్క మహిళ, బాలింత, గర్భిణీలు పోషకాహార విలువలు తీసుకోవడం ద్వారా మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని ఎంపీపీ నజుమున్నీ సాబేగం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసిల్దార్, సిడిపిఓ హేమలత సూపర్వైజర్ సునీత, అంగన్వాడి టీచర్లు రజియా, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకుంటే ఇద్దరు గెలుస్తారు

### - పరిష్కారమైన కేసులకు పైకోర్టులో అప్పీల్ ఉండదు

### - జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి పాపిరెడ్డి





**పాలమూరు మేజర్ న్యూస్ :** రాజీమార్గమే రాజమార్గమని, కేసుల్లో ఇరుక్కొని పోలీస్ స్టేషన్లు, కోర్టులు, జైలుకు తిరిగి సమయం వృధా చేసుకోకుండా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకొని ప్రశాంత వాతావరణంలో జీవించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి పాపిరెడ్డి అన్నారు. జాతీయ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి పాపిరెడ్డి మాట్లాడుతూ ఇరువురు కొట్లాడుకుంటే ఇద్దరు నష్టపోతారని అన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకునే కేసుల్లో కక్షిదారులు ఇద్దరు గెలుస్తారని అన్నారు. కోర్టులో కేసులు నడుస్తూ ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టు జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ను ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీలైనన్ని ఎక్కువ కేసులు లోక్ అదాలత్ లో పరిష్కరించడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. లోక్ అదాలత్ లో పరిష్కారమయ్యే కేసులకు సంబంధించి పైకోర్టులో అప్పీల్ ఉండదని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి ఆర్ శ్రీదేవి, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఎస్పీపి చంద్రకళ, ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి వై పద్మ, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి ఎం సంధ్యారాణి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సూరంపూడి శ్రీదేవి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ చైతన్య, ఎక్సైజ్ కోర్టు జడ్జి వి హరికుమార్, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె నిహారిక, నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే భావన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించాలి

### - జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యురాలు కాట్రావత్ లక్ష్మి



**వనపర్తి ప్రతినిధి, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పారదర్శకంగా అందించే విధంగా చూడాలని జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యురాలు కాట్రావత్ లక్ష్మి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయం జడ్పి సి.ఈ.ఓ చాంబర్‌లో 6వ స్థాయి సంఘ సమావేశం నిర్వహించగా పానగల్ జడ్పీటిసి కే. లక్ష్మి అధ్యక్షత వహించారు. 6వ స్థాయి సంఘ సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి,బి.సి. సంక్షేమ శాఖ, గిరిజన అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ ల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన వారందరికీ అందేవిధంగా చూడాలని సూచించారు. జడ్పి సి. ఈ. ఒ యాదయ్య, కోఆప్షన్ సభ్యులు మునిరుద్దిన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలతో పాటు విద్యార్థుల కష్టాలు కూడా తెలుసుకోవాలి

### - స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్



**ధన్వాడ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారికి సంబంధించిన సమస్యలపై చర్చించడం శుభపరిణామం. అలాగే పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా విద్యార్థి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ అన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో సమస్యలు శివతాండవం చేస్తున్నాయి. మౌళిక వసతులు లేక, సరిపడు బోధన సిబ్బంది లేక అరకొర చదువులు సాగుతున్నాయి. వాటిపై ప్రభుత్వం దృష్టి సారించి, నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో యూనివర్సిటీ స్థాయిలో ప్రాథమిక విద్య మొదలుకొని ఉన్నత విద్య వరకు రకరకాల సమస్యలు వెంటాడుతున్నాయి.వాటన్నింటినీ పరిష్కరించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది.కావునా విద్యార్థి సంఘాలతో, విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం అడుగులు వేయాలని లక్ష్మణ్ కోరారు.

## విద్యార్థినులు సర్టిఫికెట్ కోర్స్ ను సద్వినియోగం చేసుకోవాలి




**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం ఐ క్యు ఏ సి, టి ఎస్ కే సి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ ఎం విజయ్ కుమార్ , ఆవోదా కంపెనీ సీఈవో ఈ జార్జ్ జోసెఫ్ ఇరువురి మధ్య ఎం ఓ యు ఒప్పందం కుదరచుకున్నారు. ఈఎంఓయూ ప్రభుత్వ కళాశాలలో ఇది మొట్టమొదటి అవగాహన ఒప్పందం అవుతుందని అన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నటువంటి మహిళా విద్యార్థులకు ఇంటి దగ్గరే ఉండి వివిధ రకాలైనటువంటి సర్టిఫికెట్ కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం వస్తుందన్నారు. ముఖ్యంగా మెడికల్ ట్రాన్స్క్రిప్షన్ గాని టాలీ కానీ లేదా ప్రైమ్ పికో అబౌట్ మరియు అడ్వాన్స్ జావా ఇలాంటి సర్టిఫికెట్ కోర్సెస్ ను ఆన్లైన్ ప్లాట్ఫారం లో కూడా కలుగుతుంది.ఆన్లైన్లో ఇంటెన్సీ ప్రోగ్రామ్స్ ఇవ్వడం ద్వారా విద్యార్థినులు స్టైఫెండ్ కూడా పొందే అవకాశం ఉంటుందని చెప్పేసి సీఈవో జాబ్ జోసెఫ్ తెలియజేశారు. ఇది ఒక చక్కటి అవకాశం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయకుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ లావణ్య మాట్లాడుతూ, కళాశాల ఎంఓయులను కుదుర్చుకోవడం ద్వారా అకాడమీ మరియు ఇండస్ట్రీల మధ్య ఒక చక్కటి రిలేషన్ ఏర్పడి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు వలన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం ఈ అవగాహన ఒప్పందం ద్వారా చేకూరుందని వారు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డాక్టర్ టి విజయలక్ష్మి, టీఎస్ కే సి కోఆర్డినేటర్ కలమ్మ, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ లావణ్య, సురయ్య, జబీన్, కళాశాల టి ఎస్ కే సి మెంటర్ స్వరూప, వివిధ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు "గద్దెనెక్కినంక" పుస్తకావిష్కరణ సభ

**పాలమూరు మేజర్ న్యూస్ :** పాలమూరు జిల్లాకు చెందిన యువకవి కె.పి.లక్ష్మీనరసింహ రచించిన " గద్దెనెక్కినంక" పుస్తకావిష్కరణ సభను నేడు ఉదయం 10 గంటలకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో నిర్వహించనున్నట్లు పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలమూరు సాహితి, పాలమూరు యువకవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథి, ఆవిష్కర్త ప్రముఖ కవి వల్లభాపురం జనార్దన, విశిష్ట అతిథులుగా ప్రముఖ విద్యావేత్త కె.లక్ష్మణ్ గౌడ్, ప్రముఖ కవి పరిమళ్, ఆత్మీయ అతిథిగా భూత్పూర్ సి.ఐ రామకృష్ణ, పుస్తక స్వీకర్త, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ హాజరుకానున్నారని తెలిపారు. భీంపల్లి శ్రీకాంత్ అధ్యక్షతన జరగనున్న, పుస్తక సమీక్షను ప్రముఖ కవయిత్రి విఠలాపురం పుష్పలత చేస్తారని తెలిపారు. సభా కార్యక్రమాన్ని ప్రముఖ యువకవులు బోల యాదయ్య, పొన్నగంటి ప్రభాకర్ సమన్వయం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పరిసర్ చలో అభియాన్
## - పాలమూరు జిల్లా ఏబీవీపు కన్వీనర్ సతీష్




**మహబూబ్‌నగర్ మేజర్‌న్యూస్ :** అఖిలభారత విద్యార్థి పరిషత్ పాలమూరు జిల్లా ఎం వీఎస్ డిగ్రీ,పిజి కళాశాలలో మై క్యాంపస్,మై ప్రైడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కళాశాలలో ఉన్న సమస్యలను రాతపూర్వకంగా వివరించారు. విద్యార్థినీ విద్యార్థుల యొక్క అభిప్రాయాలను ఈ కార్యక్రమంలో పంచుకొన్నారు. కళాశాల అభివృద్ధి కోసం చేయాల్సిన కార్యక్రమాలను, కళాశాలకు అవసరమైన పనుల గూర్చి చర్చించారు. కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల యొక్క పాత్ర కీలకమని, విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు రావడం వల్ల సమాజంలో జరుగుతున్న ప్రతి ఒక్క విషయం పట్ల అవగాహన కలుగుతుందని, విద్యార్థులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, శివరాం, బలరాం,సిద్ధూ, అరవిందు, మహేష్ మధు ,రమణ, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం



**కౌకుంట్ల మేజర్ న్యూస్:** కౌకుంట్ల మండలంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సి ఎఫ్ ఎల్ ఫీల్డ్ ఆఫీసర్ , సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్,లతో ఉపాధి హామీ పథకం లో పనిచేసే కూలీలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు వ్యక్తిగత ఫైనాన్స్ కు సంబంధించిన విషయాల్లో అవగాహన మరియు బ్యాంకులో ఇన్సూరెన్సు మరియు బ్యాంక్ ద్వారా వచ్చే పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత అవగాహన సి ఎఫ్ ఎల్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ, సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్ తిరుపతమ్మ ,భాస్కర్, తదితరులు పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.

## అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి
## - అంగన్వాడి సూపర్వైజర్ కల్పన



**మిడ్జిల్ మేజర్‌న్యూస్:** అంగన్వాడికేంద్రాల్లో గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు పెడుతున్న పోషకా హారం సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ కల్పన సూచించారు. శనివారం మండల పరిధిలోని మసిగండ్లపల్లి అంగన్వాడి కేంద్రంలోని అంగన్వాడి టీచర్ రాణి ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంగన్వాడీ సూపర్వైజర్ కల్పన హాజరయ్యారు అంగన్వాడి కేంద్రాలకు వస్తున్న పిల్లలు గర్భిణీలు బాలింతలకు పోషకాహారం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు గర్భిణీలు ఆకుకూరలు గుడ్లు పోషకాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు అంగన్వాడి కేంద్రాల్లో సకల సౌకర్యాలు కల్పించాలని టీచర్లకు సూచించారు. ఆయా లావణ్య చిన్నారులు గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బెంచీలు బహుకరణ



**దేవరకద్ర( కౌకుంట్ల )మేజర్ న్యూస్:** దేవరకద్ర మండలం లోని గోపన్ పల్లి గ్రామానికి చెందిన భగవంతు రెడ్డి సేవా సమితి నిర్వాహకులు రాందేవ్ రెడ్డి గోపన్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బెంచీలను రిపేర్ చేయించి, 36వేల రూపాయలు ఖర్చు పెట్టి, పాఠశాలకు నూతన బెంచీలను బహుకరణ చేశారు. బెంచీలను ఏర్పాటుచేసిన కోట్ల భగవంతు రెడ్డి సేవాసమితి నిర్వాహకులు రాందేవ్ రెడ్డికి గోపన్ పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ హక్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



**లింగాల, మేజర్‌న్యూస్:** ఈ నెల 18 నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షలలోఎటువంటి లోపాలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టినట్లు లింగాల హై స్కూల్ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రాంసింగ్, డిపార్ట్మెంట్ ఆఫీసర్ చెన్నయ్య అదేవిధంగా సోషల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ స్కూల్,కాలేజీ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నరేందర్ రెడ్డి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. లింగాలలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 279 మంది పరీక్షలు రాయబోతుండగా అందులో ఆంగ్ల మాధ్యమంలో 158 మంది,తెలుగు మాధ్యమంలో 121 మంది విద్యార్థులు ఉన్నారు. హైస్కూల్ పరీక్షా కేంద్రంలో తెలుగు మాధ్యమంలో 57, ఇంగ్లీష్ మాధ్యమంలో 54 మొత్తంగా 111, రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో 104 తెలుగు మాధ్యమంలో 64 మొత్తంగా 168 మంది పరీక్షలు రాయబోతున్నారు. తెలుగు మాధ్యమంలో లింగాలలోని కేజీబీవీ నుండి 39 మంది బాలికలు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల 12, అంబటిపల్లి హై స్కూల్ బాలురు 23 బాలికలు 17 మొత్తం 40 ఆంగ్ల మాధ్యమంలో బాలుర రెసిడెన్షియల్ పాఠశాల 79, లింగాల హై స్కూల్ తెలుగు మీడియం బాలురు 35 బాలికలు 24 మొత్తం 59 ఇంగ్లీష్ మీడియంలో బాలురు 35 బాలికలు 15 మొత్తం 50 మంది ఉండగా రెండు మీడియాలు కలిపి బాలురు 70, బాలికలు 39 మొత్తం 109 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించుటకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయము 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల ఐదు నిమిషాల ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. పరీక్షల్లో ఎవరైనా మాస్ కాపీయింగ్ పాల్పడితే వారికి మిగిలిన పరీక్షలు రాయకుండా డిబార్ చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, పరీక్షల సిబ్బంది ఎవరు కేంద్రాలలోనికి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని రావడం నిషేధమని వెల్లడించారు.విద్యార్థులు హాల్టికెట్, ప్యాడ్, పెన్నులు, పెన్సిల్, స్కేలు, షార్ప్నర్, ఎరేజర్, జామెట్రీ పరికరాలు మాత్రమే తీసుకుని రావాలని పరీక్ష ముగిసేవరకు విద్యార్థులు, సిబ్బంది బయటకు వెళ్లరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని యజమానులకు ఆదేశించారు.

# ఐఎన్టీయూసీ నాయకుల ముందస్తు అరెస్టు




**బిజినేపల్లి మేజర్ న్యూస్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడి హాజరయ్యే బీజేపీ విజయ సంకల్పయాత్ర బహిరంగ సభను అడ్డుకుంటారని ఐఎన్టీయూసీ జిల్లా నాయకులను పోలీసులు శనివారం ముందస్తు ఆరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈసందర్భంగా ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మ్యాతరి సుదర్శన్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం కర్షక, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తుంటే బీజేపీ నాయకులు భయపడి అక్రమ ఆరెస్టులు చేయిస్తున్నారని విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లాకు ప్రధానమంత్రి ఏమీ అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించిన తర్వాతే అడుగు పెట్టాలని ప్రశ్నించారు. బీజేపీ పదేళ్ల పాలనలో సామాన్యులకు, రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. విశ్వగురు, ఆత్మ నిర్భర్ భారత్, మేకింగ్ ఇండియా వంటి మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రగాల్భాలు పలికిన మోడి దేశంలో నిరుద్యోగం 50 ఏండ్ల గరిష్ట స్థాయికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా నెలకు రూ. పదివేల పెన్షన్, పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో ఐఎన్టీయూసీ మండల నాయకులు మ్యాతరి సత్యం, ప్రబాకర్, రాములు, బాలరాజు తదితరులు ఉన్నారు.

# శని గ్రహదోష పరిహారం నివారణకు శనీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు



**బిజినపల్లి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో ఫాల్గుణ మాసం శనివారం సప్తమి నాడు శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల అభిషేకాలు పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధానఅర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఫాల్గుణ మాసంలో శనేశ్వర స్వామికి,పరమ శివునికి పూజలు చేయడం పుణ్య ఫలితం అన్నారు.భక్తుల జన్మ రిత్యా,గోచార రీత్యా అర్ధాష్టమ శని,అష్టమశని, ఏలినాటి శనిగ్రహదోషాలు తొలగుటకు, శనిగ్రహ శాంతి కొరకు శనేశ్వర స్వామినీ నువ్వులనూనె, జిల్లేడుపూలు, జమ్మి ఆకులతో ఈరోజు పూజించారని అన్నారు.బ్రహ్మ సూత్రం గల పరమశివునికి ఈరోజు భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చనలు ప్రత్యేకంగానిర్వహించినట్లు ఆయనతెలిపారు. గణపతి, నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జామునుండి స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు,అష్టోత్తర, అర్చనలు పూజలుచేశారు.భక్తులు పరమశివుని పూజలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలోఆలయ చైర్మన్ గోపాలరావు,గ్రామ ఆలయకమిటీ సభ్యులు, వీరశేకర్,ప్రభాకర్, పుల్లయ్య,ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్, జయంత్,సాయి,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

# కల్వకుర్తి లయన్స్ క్లబ్ ను సందర్శించిన డిస్టిక్ రెండవ గవర్నర్ అభ్యర్థి



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** కల్వకుర్తి లయన్స్ క్లబ్ ను శనివారం లయన్స్ డిస్ట్రిక్ట్ రెండవ గవర్నర్ అభ్యర్థి సురేష్ జజ్జాని సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించి అభినందించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబును ప్రత్యేకంగా సన్మానించి మెమొంటో బహుకరించారు, ఆయనతోపాటు అధ్యక్షుడు లయన్ కల్మచర్ల రమేష్ కార్యదర్శి లయన్ చిగుళ్లపల్లి శ్రీధర్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్ లను శాలువతో సత్కరించి మెమొంటో బహుకరించారు, మరిన్ని సేవలు కొనసాగించాలని కోరారు, మొదటిసారిగా కల్వకుర్తికి వచ్చిన సురేష్ జజ్జాని నీ కల్వకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు, మాజీ గవర్నర్ రమేష్ బాబును ప్రత్యేకంగా సన్మానించి మెమొంటోను అందజేశారు, ఈ కార్యక్రమంలో జాన్సన్ పూనమ్ జైన్ తదితరులు ఉన్నారు.

# రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం : జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమని



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లు ఎవరైనా ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి హెచ్చరించారు. వంగూరు మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు అంజయ్య ఈ నెల 14న వేరుశనగ విక్రయించేందుకు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కు 105 బస్తాల వేరుశనగ తీసుకొచ్చాడు, ఈ వేరుశనగను శ్రీ వెంకటేశ్వర కమిషన్ ఏజెంట్ వీ రెడ్డి హనుమంత్ రెడ్డి తండ్రి వీ రెడ్డి నారాయణరెడ్డి కొనుగోలు చేసినట్లు బాలమని తెలిపారు. సదరు కమిషన్ ఏజెంట్ 105 బస్తాలకు గాను 91 బస్తాలకు ధర నిర్ణయించి బిల్ చేశాడు, 14 బస్తాలు మాయం చేసినట్లు వెల్లడించారు. ఈ విషయం గుర్తించి రైతు అంజయ్య మార్కెట్ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దీనిపై డిఎంఓ బాలమని శనివారం విచారణ చేపట్టారు. రైతును మోసం చేసిన శ్రీ వెంకటేశ్వర కమిషన్ ఏజెంట్ కు అధికారులు నోటీసు జారీ చేశారు, 24 గంటల్లో ఇచ్చిన నోటీసుకు సమాధానం చెప్పాలని మార్కెట్ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. అదేవిధంగా కమిషన్ ఏజెంట్లు సాదా చిట్టీలు వాడకూడదని తక్ పట్టీలు మాత్రమే ఉపయోగించాలని బాలమని సూచించారు, మార్కెట్ యార్డ్ లో ఉన్న కూరగాయల కమిషన్ ఏజెంట్లు, ధాన్యం కమిషన్ ఏజెంట్లకు దీనిపై వెంటనే నోటీసులు జారీ చేయాలని జిల్లా మార్కెటింగ్ అధికారి బాలామణి ఆదేశించారు. ఆమె వెంట మార్కెట్ కార్యదర్శి భగవంతు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లను పూర్తి చేయండి : ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి రాజు



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయంలో ఎంసిహెచ్ సెంటర్ సిబ్బందికి ఆశాకార్యకర్తలకు అభా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లపై ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి రాజు రివ్యూ తీసున్నారు. ప్రతి ఆశాకార్యకర్తపరిధిలో నెలనెల బీపీ షుగర్ వారికి ఫాలో అప్స్, కొత్త వారిని గవర్నమెంట్, ప్రైవేటులో గుర్తించాలని తద్వారా మన పర్సంటేజీలు పెరుగుతాయని తెలిపారు. బిపి, షుగర్ వారికి ప్రతి ఒక్కరికి పరీక్షలు చేసిన తర్వాతనే మందులు పంపిణీ చేయాలని తెలిపారు. అదేవిధంగా పాలియేటివ్ కేర్, వృద్ధుల సంరక్షణ, ఎన్సిడి క్లినిక్, మెంటల్ ఆరోగ్యం, ఇవన్నీ కూడా మీ పరిధిలో ఉన్న వారికి తెలియజేసి ఉపయోగించుకునే విధంగా చేయాలని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్యామ్ సుందర్, మక్సూద్, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మి, ఏఎన్ఎమ్‌లు గ్రేస్, లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి శివుడి ప్రతిమ జ్ఞాపికగా అందజేత

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ



**వనపర్తి న్యూటౌన్, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నిర్వహించిన విజయ సంకల్ప సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్నగర్ పార్లమెంట్ అభ్యర్థి శ్రీమతి డీకే అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారి బంగారు శృతితో కలిసి శివుని ప్రతిమతో కూడిన జ్ఞాపికను బహూకరించరు. శనివారం నాగర్ కర్నూల్ లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ నిర్వహించిన విజయ సంకల్ప సభకు చాలా పెద్ద ఎత్తున జన సమీకరణ చేశారని, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యుడు పోతుగంటి భరత్ ప్రసాద్ గెలుపు కోసం కష్ట పడాలని ప్రధాని నరేంద్ర మోడీ వనపర్తి బిజెపి జిల్లా అధ్యక్షులు నారాయణకు సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి వారణాసి కల్పన బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్థంభ మహెూత్సవంలో పాల్గొన్న జెడ్పి చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరిత



**గద్వాల మేజర్‌న్యూస్:** గద్వాల పట్టణంలోని నది అగ్రహారంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం మహెూత్సవం, కళ్యాణ పూజ కార్యక్రమాలలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ సరితమ్మ హాజరై మొక్కులు తీర్చుకున్నారు, జడ్పీ చైర్ పర్సన్ సరితమ్మ మాట్లాడుతూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు ఆయుష్, ఆరోగ్యం పాడి పంటలు దిన దిన అభివృద్ధి కలగాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు. వీరిని దేవాలయ నిర్వాహక కమీటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేంద్ర యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కేకే, వెంకటన్న,పరుశ రాముడు, సమీ, తిరుపతన్న, బోయ వెంకటేష్, మలకంటి, జయన్న, దామోదర్ తదితరులు ఉన్నారు.

## విజయవంతమైన జాతీయ లోక్ అదాలత్ : జిల్లా జడ్జి డి రాజేష్ బాబు.




**నాగర్‌కర్నూల్, మేజర్ న్యూస్:** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించామని, ఈరోజు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 15100 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు తెలిపారు. కేసులను రాజు చేసుకోవడం వలన కక్షిదారులకు ఆర్థిక వనరులు, సమయభావము, కోర్టు చుట్టూ తిరగడం లాంటి కార్యక్రమాలన్నీ తగ్గుతాయని ఇరు పక్షాలు రాజీ చేసుకోవడం వల్ల దీర్ఘకాలికంగా ఉన్న మనస్పర్ధలు తగ్గుతాయని తెలిపారు. జిల్లా న్యాయమూర్తులు సబిత, పి మౌనిక, కే మమతారెడ్డి ,ఎన్ శ్రీనిధి, న్యాయవాదులు కోర్టు సిబ్బంది అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర

### - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. యం. సంతోష్

**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్ %ర% జిల్లా ఎన్నికల అధికారి బి. యం. సంతోష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా ఎన్నికల నిర్వహణకై నియమించిన నోడల్ అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, జిల్లాలో నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన ఎన్నికల విధులను పూర్తి అవగాహన కలిగి ఉండి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పార్లమెంటు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్ ల వద్ద అవసరమైన రాంపులను, ఇతర సదుపాయాలను కల్పించేందుకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మొదటి రాండమైజేషన్ తర్వాత పిఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సామాగ్రికి సంబంధించి ఎప్పటి కప్పుడు రాష్ట్రస్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు చేస్తూ ఎన్నికల సామాగ్రిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎన్నికల మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారికి ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై సంబంధిత నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరించడం , సి- విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సృష్టికి మూలం స్త్రీ : వీసీ రాథోడ్



**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్ :** పాలమూరు యూనివర్సిటీ లో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం అకాడమిక్ బ్లాక్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉపకులపతి లక్ష్మికాంత్ రాథోడ్ హాజరై,సృష్టి కి స్త్రీ మూలం అని, స్త్రీలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, ఆడది అంటే అబల కాదని సభల అని నిరూపిస్తున్నారని, స్త్రీలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని, మహిళా అభివృద్దే మానవాళి అభివృద్ధి అని, పీయూలో మహిళలకు ఏ బాధ్యత అప్పగించిన, ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తారని అన్నారు. కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ మాధవి (ఓయూ) మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాలలో రానిస్తారని, స్త్రీ లలో ఉన్న ప్రతిభ ను గుర్తించి అవకాశాలు ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని, ప్రతి పురుషుని విజయం వెనుక స్త్రీ ఉంటుందని, పని చేసే చోటు స్త్రీ లకు స్వేచ్ఛ వాతావరణం కల్పించాలని, వంటిల్లు తో పాటు దేశాన్ని పాలించే శక్తి మహిళలకు ఉందని,మహిళా శక్తి ని ఉపయోగించుకొని దేశం అభివృద్ధి చెందాలని అన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు బహుమతులు ప్రధానము చేశారు. ఈ కార్యక్రమం లో టీచింగ్, నాన్ టీచింగ్ మహిళా స్టాఫ్ ను సన్మానం చేశారు.ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డా కె. ప్రవీణ,పరీక్షల నియంత్రణ అధికారి డా రాజ్ కుమార్, ఐ క్యూ ఎ సి డైరెక్టర్ డా కిషోర్,చైర్మన్ డా చంద్రకిరణ్, వైస్ చైర్మన్ డా కృష్ణయ్య, ప్రోగ్రాం అధికారులు డా రవి కుమార్, డా అర్జున్ కుమార్, డా శివ కుమార్ సింగ్, గాలేన్న, జ్ఞానేశ్వర్, డా వెంకట రాఘవేందర్, అధ్యాపకులు డా భూమయ్య, డా జిమ్మీ కార్టన్,డా పర్వతాలు డా బషీర్ అహ్మద్, నాన్ టీచింగ్ సత్యం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ వ్యాధిసర్వేను పరిశీలించిన ఎల్సిడిసి స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ జరీనా భాను



**ఇటిక్యాల మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఎల్సిడిసి కుష్టు వ్యాధి సర్వే సర్వేను ఇటిక్యాల పీఎస్సీ కొండేరు గ్రామంలో పర్యవేక్షించారు సర్వే ఏ విధంగా జరుగుతుందో ఆశాలను అడిగి తెలుసుకున్నారు అలాగే అనుమానమైన కేసులను పరీక్షించారు ఈ ఎల్‌సిడిసి సర్వే 14 రోజులు నిర్వహించడం జరుగుతుందని ఇంటింటికి తిరిగి పరీక్షలు చేస్తారు ఎవరికైనా అనుమానం ఉన్న మచ్చలు స్పర్శ లేని మద్దుబారిన మచ్చలు ఉంటే వాటిని గుర్తించి డాక్టర్ గారు చూయించి నిర్ధారణ అయితే వారికి చికిత్సను ఉచితంగా అందజేస్తారు ఈ మచ్చలున్న కేసులు ఎవరన్నా ప్రజలు చూయించుకోకపోతే ఆ యొక్క బ్యాక్టీరియా చేతులు మరియు కాళ్ళ యందు గల నరాలపై బ్యాక్టీరియా ప్రభావం చూపిస్తుంది దానివల్ల అంగవైకల్యం వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రజలు కూడా మీ దగ్గరికి వచ్చే ఆశా కార్యకర్తలకు చూపించుకోగలరని తెలిపినారు ఈ పర్యవేక్షణలో జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ డి ప్రేమ్ సాగర్ మరియు డి పి ఎం హనుమంతరావు మరియు సూపర్వైజర్ శంకరయ్య శెట్టి లెప్రసీ నోడల్ పర్సన్ రమేష్ బాబు ఏఎన్ఎం నర్మదా ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొల్లాపూర్ పీజీ హాస్టల్లో మెస్ ప్రారంభించాలి

### - వినతిపత్రం అందజేసిన విద్యార్థి సంఘాల నాయకులు



**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్ :** కొల్లాపూర్ పీజీ కళాశాలలో మెఎస్ ప్రారంభించాలని శనివారం పియువిసి లక్ష్మీకాంత్ రాథోడ్‌కు వినతిపత్రం పియు జెఎసి బత్తిని రాము అందజేశారు.రాము మాట్లాడుతూ, యూనివర్సిటీ ప్రారంభం నుండి పీజీ హాస్టల్స్ భవనాలు నిర్మించారు కానీ మెస్సు ప్రారంభించడం లేదని దీని ద్వారా సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు రెగ్యులర్గా హాస్టల్ రూమ్ లో భోజనం తయారు చేసుకుని తరగతులకు సరైన సమయంలో హాజరు కాలేకపోతున్నారని అన్నారు. సెమిస్టర్ పరీక్షలకు ఆలస్యంగా వెళుతున్నారని పరీక్షలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తక్షణమే మెస్సును ప్రారంభించాలని దానితోపాటు వైఫై, త్రాగు నీరు, లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని దీని ద్వారా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ సమస్యలపై విసి సానుకూలంగా స్పందించారని తెలిపారు. స్వేరో స్టూడెంట్ యూనియన్ పియు అధ్యక్షుడు సురేందర్, ఎమ్మెస్ ఎఫ్ జిల్లా నాయకులు కిందిగేరి వెంకట్ యూనివర్సిటీ విద్యార్థులు సౌందర్య ,పద్మ, ఉమా గౌరి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

## గద్దె గూడెం పాఠశాలకు తాగునీటి ట్యాంకు బహుకరణ : లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గాజుల శ్రీనివాసులు



**దేవరకద్ర మేజర్ న్యూస్ :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గద్దె గూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రగతికి అన్ని విధాలా చేయుత నిస్తామని లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గాజుల శ్రీనివాసులు అన్నారు. జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త, పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్ ప్రాతినిధ్యం మేరకు లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ లయన్ గాజుల శ్రీనివాసులు తన సొంత ఖర్చులతో దేవరకద్ర మండలం గద్దె గూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకు ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ యం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్, వాటర్ ట్యాంక్ దాత గాజుల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక వైపు ప్రభుత్వం కృషి చేస్తుండగా మరో వైపు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించడం అభినంద నీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు లయన్స్ క్లబ్ అనేక రకాలుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు విద్యార్థుల అవసరాల దృష్ట్యా గద్దె గూడెం పాఠశాలకు వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన తాగు నీటి ట్యాంక్ ను ఉచితంగా బహూకరించినట్లు శ్రీనివాసులు తెలిపారు. పేదల సంక్షేమానికి లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంస నీయమని పిఆర్టియు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త అశ్విని చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషి తో పాటు లయన్స్ క్లబ్ లు, రెడ్ క్రాస్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల కు తమ వంతు సహకారం అందించడం అభినంద నీయమని అన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్విస్ట్ చైర్మన్ లయన్ ఎ.శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని విధాలా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు అవసరమైన సహకారం లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తామని చెప్పారు. పాలమూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ గిరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ అధ్యక్షులు లయన్ గోపాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. పాఠశాలకు తన సొంత ఖర్చులతో ఆట వస్తువులు అందిస్తానని విద్యార్థుల హర్ష ధ్వనుల మధ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ యం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు మన్సూర్, జగదీష్, శారద, అనురాధ, స్నేహాలత, ఇందిరా, ఎస్ యం సి మాజీ చైర్మన్ లక్ష్మయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## పశు సంపదను పెంచండి



**వడ్డేపల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బుడమర్సు గ్రామంలో శనివారం 42 మంది రైతులకు సంబంధించి 294 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగిందని డాక్టర్ పుష్పలత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో పశు సంపద పెంపు కోసం పశు వైద్య పశు సంవర్ధన శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని మండలం వైద్య అధికారి పుష్పలత అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి వరప్రసాద్. లైవ్ స్టాక్ అసిస్టెంట్ లతీఫ్. గోపాలమిత్ర లక్ష్మన్న పశు రైతులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం : ఎంఈఓ రాజు



**ఎర్రవల్లి మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మరియు ఇటిక్యాల మండలాల్లోని పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడం కోసం 4 పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని మండల విద్యాశాఖ అధికారి రాజు శనివారం తెలిపారు ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎర్రవల్లి ఇటిక్యాల మండలాల్లో కేంద్రాలు నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు మొత్తం 611 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

## పంచాయతి కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**దామరగిద్ద మేజర్‌న్యూస్:** కానుకుర్తి గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న గుడి సాయి లక్ష్మప్ప శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా మరణించడం బీద కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఏదైనా ఆర్థిక సహాయం అందించాలని కానుకుర్తి గ్రామ ఎంపిటిసి మోనపురం బస్వరాజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేరి సుదర్శన్ రెడ్డి ఎండి మోయిన్‌ల ఆధ్వర్యంలో లో ఎంపిడిఓ శ్రీధర్ ఎంపి ఓ ఉదయ్ శంకర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## ఎమ్మెల్యే నిధులతో కురువ వాడలో బోర్



**ధన్వాడ మేజర్ న్యూస్ :** నారాయణపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి నిధులలో కురువ వాడలో బోర్ వేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు జట్రం లక్ష్మణ్ గౌడ్, చిట్టెం రాఘవేందర్ రెడ్డి, ఎండి కదిరి పాషా, ఆనంద్ గౌడ్, కటికరి నరసింహులు,నీరటి బాబా, కురువ సంఘం పెద్దలు ఇతరులు పాల్గొనడం జరిగింది.

## వెయ్యి బీడీలకు రూ 350 కూలి చెల్లించాలి

## - ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం



**చిన్నచింతకుంట మేజర్ న్యూస్ :** బీడీ కార్మికుల విస్తృత సమావేశం శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో నిర్వహించారు ఈ సభకు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జె ఎన్ దేవాదానం అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కే సూర్యం పాల్గొని మాట్లాడుతూ వేయి బీడీలకు 350 రూపాయలు పెంచాలని పిఎఫ్ లో తప్పులు యజమాన్యం సరిచేయాలని గ్రాటివిటీ సక్రమంగా అమలు చేయాలని కోరడం జరిగింది, అనంతరం బీడీ కార్మికులు పురవీధుల గుండా ర్యాలీగా బయలుదేరి వస్తాద్ బీడీ ఫ్యాక్టరీ యజమాని సోహెల్ సెట్ కు బీడీ కార్మికులు కార్మిక సంఘాల నాయకుల తో కలిసి డిమాండ్ నోటీసు ఇవ్వడం జరిగింది బీడీ కార్మికుల డిమాండ్లపై 15 రోజులలో చర్చలకు పిలిపించడం జరుగుతుందని సోహెల్ సెట్ హామీ ఇవ్వడం జరిగిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి, వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామెల్,అరుణ్ కుమార్, ఐఎఫ్టియు నాయకులు సి రాజు,ప్రసాద్ శ్రీ వెంకటేష్ గౌడ్ అరుణోదయ చంద్రన్న, అడ్వకేట్ ఆర్.ఆర్ మన్యం ఉమ్మడి జిల్లా బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులు









**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో శనివారం ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా టిఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్లా బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, కడ్తాల్ జెడ్పిటిసి దశరత్ నాయక్, ఆమన్ గల్ జడ్పిటిసి అనురాధ పత్యానాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, గంప వెంకటేష్, మాజీ జడ్పిటిసి నరసింహ, గోవర్ధన్, జ్యోతయ్య,గోపాల్ నాయక్, పావని, దారమోని గణేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

***కెసిఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేకనే అక్రమ అరెస్టులు***
***– బిఆర్ఎస్ నాయకుల నిరసన***

**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుకు వెతిరేకంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గద్వాల పట్టణ అధ్యక్షులు తెలుగు గోవిందు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అప్రజాస్వామికంగా ఎమ్మెల్సి కవితను పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ కేంద్రప్రభుత్వం ఈడీ అధికారులతో అక్రమ అరెస్టులు నిర్వహింస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగిరెడ్డి, శ్రీనివాసులు, నరహరి శ్రీనివాసులు, నరహరి గౌడ్, మహేష్, కృష్ణ, శ్రీమన్నారాయణ, జమ్ములమ్మ దేవాలయ మాజీ చైర్మన్ సతీష్, మాజీ సర్పంచ్ నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు కోటేష్, నాగులు యాదవ్, కుర్మన్న, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, హెూటల్ హన్మంతు, ముబీన్ గద్వాల పట్టణ ఉపాధ్యక్షులు ధర్మానాయుడు, తోట రాముడు, పరశారాముడు, కమ్మరి రాము, వీరేష్, నర్సింహులు తదితర బిఆరెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్, మేజర్ న్యూస్ :** కవిత అక్రమ అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్ర బి.ఆర్. యస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా లో పట్టణ పార్టీ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్దం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, మాణిక్యం, బీచుపల్లీ యాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బి.ఆర్. యస్ పార్టీని, కె.సి.ఆర్ ను బలహీన పరచాలని కుట్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నీ కవిత ను అక్రమ అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టులో కేసు విచారణ ఉన్న బేఖాతర్ చేస్తూ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ అని చూడకుండా కోర్టుకు వెళ్ళే అవకాశం ఇవ్వకుండా అరెస్ట్ చేయడం తగదని వెంటనే కవిత ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్స్ పుట్టపాక మహేశ్, నాగన్న యాదవ్, బండారు కృష్ణ, కంచె రవి, నాయకులు తిరుమల్, శరవంద, స్టార్ రహీమ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, అరుణ్ యాదవ్, దేవార్ల నరసింహ, సయ్యద్, జమీళ్, ఎం .బాలు నాయుడు, జోహేబ్, చిట్యాల రాము, మహేశ్వర రెడ్డి, కో ఆప్షన్ ఇమ్రాన్, కవిత, సాయిలీల, ప్రవీణ్, లోకాజీ, సిరివాటి సురేష్, శంకర్, రామస్వామి, తోట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

***రాజకీయ కక్షతోనే కవిత అరెస్టు***
***: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్***

**మక్తల్,మేజర్ న్యూస్:** బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమమని, సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో..ఈ డీ సోదాలపేరుతో అరెస్టు చేయడం తెలంగాణ ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి నరసింహ గౌడ్ శనివారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.రాజకీయ సీరియల్‌తలపించేలా ఇన్నిరోజులు విచారణ పేరుతో అయోమయానికి గురిచేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ తీరా లోకసభ ఎన్నికలకు ముందు అకారణంగా అరెస్టు చేయడం రాజకీయ కక్షలకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడమేనని దుయ్యబట్టారు. ఇది చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమేనన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రగతి పథంలో ముందుకుపోయిన రాష్ట్రాన్ని చెల్లా చెదురు చేసి తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు బీజేపీ జాతీయ నేతలు పన్నిన రాజకీయ కుట్రలో భాగమేనన్నారు.

**గోపాలపేట మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ కవితను అక్రమంగా కేసులు విధించి అరెస్టుకు నిరసనగా టిఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పార్టీ కక్ష పూరిత ధోరణితోనే అక్రమంగా అరెస్టు చేయిస్తుందని ఆరోపించారు ఈ కార్యక్రమంలో వైసీపీ చంద్రశేఖర్ కో ఆప్షన్ సభ్యుడు మతిన్ నాయకులు తిరుపతయ్య యాదవ్ హర్ష నాయక్ నాగరాజు బిళ్ళ కంటి రాజు ఆర్ వెంకటయ్య మన్యం నాయక్ తదితరులున్నారు.

## రాజీమార్గమే రాజ మార్గము - జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ



**నారాయణపేట టౌన్ మేజర్‌న్యూస్:** రాజిమార్గంతో ఎలాంటి కేసులైనా పరిష్కరించుకోవచ్చని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ డిఎల్ఎస్ఎ నారాయణపేట మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి కం సీనియర్ సివిల్ జడ్జి జి. శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జకియా సుల్తానా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ఇతర న్యాయ వాదులు కలిసి లోక్ అదాలత్‌కు వచ్చిన వివిధ రకాల కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యం అన్నారు. ప్రజలు తమకు అండగా నిలిచి సహకరించాలని కోరారు. కాగా శనివారం నాటి లోక్ అదాలత్‌లో నారాయణపేట జిల్లా కోర్టు పరిధిలో 51820 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని వారి కేసులను ఉచితంగా వాదించడానికి న్యాయవాదులను నియమిస్తుందని, అలాగే లోక్ అదాలత్ కేసుల సమస్యల కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర న్యాయవాదులు కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి పద్మశాలీల పాలాభిషేకం



**ధన్వాడ మేజర్‌న్యూస్:** అణగారిన పద్మశాలి సోదరుల ఆర్థిక స్థితిగతుల గురించి అలోచించి పద్మశాలి జాతి కోసం, రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కల్గిన పద్మశాలి సామాజికవర్గానికి న్యాయం చేసే దిశగా మన సామాజిక ,ఆర్థికాభివృద్ధిని కాంక్షించి పద్మశాలిలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపించి కష్టపడినకుంభం.శివకుమార్ రెడ్డి కి నారాయణపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్.చిట్టెం.పర్ణికా రెడ్డికి ధన్వాడ మండల పద్మశాలి సోదరులందరిచే కృతజ్ఞతాభావంతో వారికి పాలాభిషేకం చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో కె.నరహరి ముదిరాజ్ అధ్యక్షుడు ధన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ గారితో పాటు జట్రం లక్ష్మయ్య పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ధన్వాడ కెంచే నరేందర్. కెంచే రఘువీర్. పెదుమూతి గోపికృష్ణ. కర్లీ సుభాష్ ఒగ్గు వెంకటరాములు. కెంచే నర్సింలు. దోమ కృష్ణయ్య. మురళి.కెంచే జయప్రకాష్. పెదుమూతి రేణుక. కర్లీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వనపర్తి రూరల్, మేజర్ న్యూస్:** వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామంలో మృతుని కుటుంబానికి వనపర్తి యువ నాయకుడు ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్ ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన వారాల బుచ్చన్న గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి నవభారత్ గ్రామ యువకులు కృష్ణకుమార్, భరత్, శివ, నితిన్, సూర్య, రాజేష్,రవి, సురేష్, వంశి,బుచ్చిరెడ్డి వనపర్తి యువ నాయకుడు ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా శనివారం బుచ్చన్న మృతదేహానికి నివాళులర్పించి మృతుని భార్య గోవిందమ్మకు రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటారని భరోసానిచ్చారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్



**వనపర్తి రూరల్, మేజర్‌న్యూస్:** వనపర్తి మండలం కాశీంనగర్ గ్రామంలో మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడి కుటుంబానికి వనపర్తి యువ నాయకుడు ఏర్వసాయి ప్రసాద్ యాదవ్ ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బండారు చిన్న రాములు కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యంతో గ్రామపంచాయతీ కార్మికుడు బండారి చిన్న రాములు మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న వనపర్తి యువ నాయకుడు ఏర్వ సాయి ప్రసాద్ యాదవ్ గ్రామానికి వెళ్లి చిన్న రాములు మృతదేహానికి నివాళులర్పించి మృతుని భార్య భాగ్యమ్మకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రాములు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని వారి కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఏర్వ సాయిప్రసాద్ యాదవ్ వెంట టీమ్ సభ్యులు సదుర్ల వినోద్ కుమార్, రేవల్లి రాములు, సాయి కిరణ్ ఉన్నారు.

## రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే మన లక్ష్యం

### - మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జుట్ల ఆనంద్ కుమార్ గౌడ్



**ధన్వాడ మేజర్‌న్యూస్:** ధన్వాడ మండల యూత్ కాంగ్రెస్ సమావేశంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది, ఇట్టి కార్యకమానికి ముఖ్యఅతిథిగా మహబూబ్ నగర్ పార్లమెంట్ యూత్ ఇంచార్జ్ చైతన్య క్రిష్ణ రెడ్డి హాజరయ్యారు. అదేవిధంగా ఇట్టి సమావేశం ధన్వాడ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జుట్ల ఆనంద్ కుమార్ సమక్షంలో జరిగింది. ఎంపీ ఎలక్షన్లో తప్పకుండా చెల్లా వంశీధర్ రెడ్డికి అత్యధికం మెజార్టీలో గెలిపించాలని యువత ఓట్లు అధిక సంఖ్యలో ఉండాలని మహబూబ్నగర్ పార్లమెంటు యూత్ ఇంచార్జ్ చేతన కృష్ణారెడ్డి తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో యువకులు కెంచే నరేందర్, నవీన్ చారి, అనిల్ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, మంగలి ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యామందిర్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం




**ధన్వాడ మేజర్‌న్యూస్:** ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యా మందిర్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు తోటి విద్యార్థులకు విద్యార్థిని ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు కలెక్టర్‌గా ఉదయ్, డిఈఓగా భవానీ హెచ్‌ఎంగా భోగం వైష్ణవి, పిఈటిగా వెంకటేష్, విష్ణు అటెండర్లుగా మణికంఠ, శివలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానాచర్యులు కాషయ్య, భరత్, చంద్రకాంత్, రవి, సుధాకర్, రాఘవులు గౌడ్, కల్పన, సరిత, అనసూయ మరియు నర్సమ్మలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

### - ఎమ్మెల్యేను సన్మానించిన ముదిరాజులు



**మహబూబ్‌నగర్, మేజర్ న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటిసారి ముదిరాజుల కొరకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకుగాను మహబూబ్ నగర్ శాసనసభ్యులు. యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వం కలిసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ మండలంలోని వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొనడం జరిగింది. గత టీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల నుంచి ఎన్నోసార్లు ముదిరాజ్ కార్పొరేషన్ కోసం ప్రయత్నించిన ఫలితం దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయం. అందుగ్గాను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా ము అని ముదిరాజ్ సంఘ నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జి. ఆశన్న ముదిరాజ్ ,పెద్ద విజయ్ కుమార్, ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కే రామచంద్రయ్య, అసెంబ్లీ కార్యదర్శి ఆంజనేయులు, తెలుగు గూడెం ముదిరాజ్ సంఘం నాయకులు రామకృష్ణ యాదయ్య, వెంకటేష్, శేఖర్, భీమయ్య, కోడూరు రామస్వామి, శ్రీనివాసులు, చందు, చెన్నయ్య, అప్పయ్య పల్లి చెన్నయ్య, మాచన్పల్లి మొగులయ్య, దాసు చౌదర్పల్లి సంజీవులు మొదలగువారు పాల్గొన్నారు.

## పాఠశాలలో టీవీ చోరీ



**గోపాలపేట మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీ శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయురాలు తెలిపారు వివరాలు ఇలా ఉన్నాయి రోజు మాదిరి పాఠశాల ముగిసిన తర్వాత పాఠశాలను తాళం వేసి వెళ్ళామని శనివారం ఉదయం వచ్చి చూడగా తలుపులకు తాళం విరగొట్టి అందులో ఉన్న స్మార్ట్ టీవీ దాదాపు 15 వేల రూపాయలు విలువగల స్మార్ట్ టీవీ ని దొంగిలించారని గత కొద్ది నెలల క్రితం ట్యాబ్ ఎత్తుకెళ్లారని హెచ్ఎం చైతన్య స్రవంతి ఫిర్యాదు చేశారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు



**కోయిలకొండ మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న అయ్యవారిపల్లి గ్రామపంచాయతీ లోని శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు( మాజీ ఉప సర్పంచ్) మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి కృషి వల్ల గ్రామ గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తయ్యాయని తెలియజేశారు. అదేవిధంగా అయ్యాపారిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,చంద్ర నాయక్ ,గోపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.గుణశేఖర్




**గద్వాల మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లాకు బదిలీ పై వచ్చిన అదనపు ఎస్పీ కె.గుణశేఖర్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. ఈయన గ్రూప్ -1, 2010 బ్యాచ్ డి.ఎస్పీగా సెలెక్ట్ అయిన అయన వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించారు. అదనపు ఎస్పీ గా ప్రమోషన్ పోంది హైదరాబాద్ లోని సీఐడి సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేసి బదిలీలో బాగంగా జిల్లాకు రావడం జరిగింది.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ ఎంపీటీసీ



**వంగూరు మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని సర్వారెడ్డిపల్లి ఎంపీటీసీ జీవన్ నాయక్ తన సహచరులతో కలిసి శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండిత్ రావు ఆధ్వర్యంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ కాంగ్రెస్ కండువా కప్పి జీవన్ నాయక్ ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి రమేష్ గౌడ్ హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



**బిజినపల్లి మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల శ్రీ ఆలార్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఫాల్గుణ మాసం శనివారం నాడు వేదమంత్ర చరణల మధ్య సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజచార్యులు తెలిపారు.ఈరోజు 20 మంది దంపతులతో సామూహికంగా వ్రతాలు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని వ్రతాలు చేశారని అన్నారు.ఫాల్గుణ మాసం విష్ణుమూర్తి స్వామివారికి ప్రీతికరమనీ, ఈమాసంలో పూజించిన,సేవించిన విశేష ఫలితం ఉంటుందని అన్నారు.భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతకల్పం విన్న భక్తులకు, తీర్థప్రసాదాలు స్వీకరించిన వారికి ఫలితం దక్కుతుందన్నారు. భక్తులకు సంకల్పించిన కోరికలు నెరవేరుతాయి అనీ, స్వామివారికి ముడుపులు చెల్లిస్తున్నారని అన్నారు. భక్తులకు ప్రతిరోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు దేవాలయంలో చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు జయంత్,శుక్ల,చక్రపాణి, ఆలయ సిబ్బంది బాబయ్య,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



**వంగూరు మేజర్ న్యూస్ :** మండలంలోని ఉపాధి కూలీలకు కావలసిన వసతులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశా న్ని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశంలో అధికారులు కనీస వసతులు కల్పించడం లేదని అన్నారు. ఉపాధి కూలీలకు కావలసిన సామాగ్రి గడ్డపార పారలు గంపలను కూలీలే కొని తెచ్చుకోవడం జరుగుతుందనీ కావలసిన పనిముట్లను ప్రభుత్వమే ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకు 272 రూపాయలు కూలీ ఇవ్వాల్సి ఉండ గా వంద రూపాయలు లోపే కూలి పడుతున్నట్లు ఆయన ఆరోపించారు. పనులు చేసిన కూలీలకు 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలనీ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం



**కల్వకుర్తి మేజర్‌న్యూస్:** క్లాస్మేట్‌క్లబ్ వ్యవస్థాపకఅధ్యక్షులు వాస రాఘవేందర్ సౌజన్యంతో క్లాస్మేట్‌క్లబ్ కల్వకుర్తిడివిజన్ ఆధ్వర్యంలో ఎంసీఏ చదువుతున్న పేద విద్యార్థిని సాయి లలిత కు 13 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్లాస్మేట్ క్లబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు క్లబ్ సహకారంఎల్లప్పుడు ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాద శోభన్ బాబు, జిల్లా ప్రతినిధి చిగుళ్లపల్లి శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు బాదం రాఘవేందర్, మాచిపెద్ది అశోక్, సభ్యులు జూలూరి ప్రకాష్, శ్రీనివాసులు, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అభయాంజనేయుడి సేవలో ఎంపి మన్నే శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**నవాబ్‌పేట, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జంగమయ్యపల్లి అభయాంజనేయ స్వామి విగ్రహ పున:ప్రతిష్ఠా మహోత్సవాల్లో ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరై ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దైవ భక్తి , ఆద్యాత్మిక చింతనతో ఉండాలని సూచించారు.ఆలయ అభివృద్ధి కోసం కృషి చేసిన గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవిందర్ రెడ్డి పీఏసీఎస్ అధ్యక్షుడు మాడెమోని నర్సిములు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మయ్య వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి యువత అధ్యక్షుడు మెండె శ్రీనివాస్ నాగిరెడ్డి సర్పంచ్ గోపాల్ గౌడ్ మధుసూదన్ రెడ్డి మెండె అంజయ్య సర్పంచ్ వెంకటేష్ యంపీటీసి నర్సింహులుభాగ్యమ్మ మాజీ ఎంపీటీసీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ రవి గ్రామ పెద్దలు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**గోపాలపేట మేజర్ న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన శివశంకర్ విద్యుత్ షాక్ కు గురై ప్రవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందినందుకు ఆర్థిక సహాయం కింద సీఎం సహాయ నిధి చెక్కును వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి వనపర్తి తన నివాసంలో అందజేశారు గ్రామానికి చెందిన శివశంకర్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందడంతో సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేసుకోగా 60 వేల రూపాయలు మంజూరు కాగాఆ రూపాయలను ఎమ్మెల్యే చెక్కును అందజేశారు బాధితుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మండలాల ఇన్చార్జి సత్య శివారెడ్డి టౌన్ అధ్యక్షుడు శివన్న ఉపాధ్యక్షుడు యాదవ్ చంద్రశేఖర్ వాడి సభ్యుడు వెంకటయ్య వెంకట రాములు భాస్కర్ బాలరాజు మల్లేష్.

## నియోజవర్గ పేదల గృహాల కల్పనకు కృషి చేస్తా : మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**కల్వకుర్తి మేజర్ న్యూస్ :** నియోజవర్గ పేదల గృహాల కల్పనకు కృషి చేస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పిటిసి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు. కల్వకుర్తి మండలం లోని పంజుగుల గ్రామానికి చెందిన పెరుమాళ్ళ నీలమ్మ, వెంకటేష్ ఇంటి నిర్మాణం కొరకు గతంలో ఇటుకలు, సిమెంటు, ఇసుక ఇవ్వడం జరిగింది. శనివారం స్లాబ్ నిర్మాణం కోసం స్టీల్, ఇసుక, కంకర, సిమెంటును తన అనుచరుల ద్వారా అందజేశారు, ఈ సందర్భంగా పేరుమాళ్ళ నీలమ్మ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, నియోజకవర్గంలోని పేద ప్రజల కోసం అనేక నివాస గృహాలను నిర్మించి పేదలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్ , గోపాల్ ,రాము, నాగరాజు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించిన జెడ్పి చైర్ పర్సన్ సరిత



**గద్వాల మేజర్ న్యూస్ :** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల పరిధిలోని పాల్వాయి గ్రామం లోని పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ సందర్శించారు అనంతరం రోగుల అందజేసే మెడిసిన్ తనిఖీ చేయడం జరిగింది.. ప్రతిరోజు సమయ పాలన పాటించి గ్రామస్థులకు అందుబాటులో ఉండాలని జెడ్పి చైర్ పర్సన్ సరితమ్మ డాక్టర్ నవీన్ కు సూచించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల రాజశేఖరరెడ్డి, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, నాగేంద్ర యాదవ్, భాస్కర్ రెడ్డి, పెద్దపల్లి శివ,డి.ఆర్ ముని,రామకృష్ణ, కుమార్ రెడ్డి, రవి, ఉల్వ నరసింహులు, చంద్రన్న, శివయ్య, రవి తదితరులు ఉన్నారు.

## ఇంటర్ మూల్యాంకనానికి పూర్తి ఏర్పాట్లు - డీఐఈఓ



**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్‌న్యూస్ :** ఇంటర్మీడియేట్ స్పాట్ వ్యాల్యువేషన్ క్యాంపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్యాంప్ అధికారి మరియు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన ఐదు జిల్లాల ప్రిన్సిపాళ్ళు, జూనియర్ లెక్చరర్లు ఈ మూల్యాంకనంలో పాల్గొననున్నారు. మొదటి స్పెల్ 16 వ తేదీ నుండి ప్రారంభం కానుందని ఇందులో సంస్కృతం, తెలుగు,హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, సివిక్స్ ఆరు సబ్జెక్టుల అధ్యాపకులు పాల్గొననున్నారు. జిల్లాల వారీగా మూల్యాంకన సిబ్బంది వివరాలను తెలియజేస్తూ, జోగులాంబ గద్వాల - 104, వనపర్తి - 187, నాగర్ కర్నూల్ - 202, మహబూబ్ నగర్-237 నారాయణ పేట్ %--% 110 మొత్తం 840 మంది మొదటి స్పెల్ మూల్యాంకనంలో పాల్గొననున్నారు. మూల్యాంకన సిబ్బంది నియామకం తో పాటు క్యాంపు ఏర్పాట్లలో భాగంగా నీరు, ఫ్యాన్లు, డ్యుయల్ డెస్కులు, వాష్ రూంలు, క్యాంటీన్ తదితర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూల్యాంకన సిబ్బంది క్యాంపు వేళలను ఖచ్చితంగా పాటించాలని ఉదయం 10 గం. ల నుండి సాయంత్రం 5 గం. ల వరకు ఉదయం 15 పేపర్లు, మధ్యాహ్నం 15 పేపర్లు మదింపు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సిబ్బంది తమ-తమ సెల్ ఫోన్లను ఛీఫ్ ఎగ్జామినర్ల వద్ద ఉంచాలని, మూల్యాంకన సమయంలో సెల్ ఫోన్లలో మాట్లాడరాదని సూచించారు. అనధికార వ్యక్తులు క్యాంపులో తిరగరాదని, సిబ్బంది అందరూ తప్పనిసరిగా ఐడెంటిటీ కార్డులు ధరించాలని సూచించారు. మూల్యాంకనంలో మార్కుల నమోదు, టోటలింగ్, బబ్లింగ్ తదితర అంశాల్లో చీఫ్ ఎగ్జామినర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో మూల్యాంకన సిబ్బందిని తప్పక రిలీవ్ చేసేలా జిల్లా అధికారులు కళాశాలలకు తగు ఆదేశాలు జారీ చేయాలని, బోర్డు ద్వారా నియామకం అయి, రిలీవ్ చేయని కాళాశాలలకు నోటీస్ లు జారీ చేసి పెనాల్టీలు విధించడం జరుగుతుందని, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అధ్యాపకులను సకాలంలో మూల్యాంకన కేంద్రానికి పంపించాలని సూచించారు.

## అన్నపూర్ణ క్యాంటిన్‌కు షెడ్ నిర్మాణం - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, మేజర్‌న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నిర్వహిస్తున్న ఐదు రూపాయల భోజనపథకం ద్వారా నిర్వహిస్తున్న అన్నపూర్ణ క్యాంటిన్ నిర్వాహణకు షెడ్ లేకపోవడంతో అటు నిర్వాహకులకు, భోజనం తినే వారు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు అని మీడియా మిత్రుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ తో కలిసి శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా అన్నపూర్ణ క్యాంటిన్ నిర్వాహకులను వారిసమస్యను అడిగి తెలుసుకున్నారు. ఐదు రూపాయల భోజనాన్ని పేదలు మధ్యతరగతి ప్రజలు ప్రతి రోజు ఐదు వందల మంది వరకు తింటారని నిర్వాహకులు ఎమ్మెల్యే కి తెలిపారు. షెడ్ లేకపోవడంతో చాలా ఇబ్బందికి గురి అవుతున్నాం అని, రోడ్డు ప్రక్కన ఎలాంటి షెడ్ లేకుండా ఎండకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కొంటున్న విషయాన్ని వారు ఎమ్మెల్యే కి దృష్టి కి తీసుకొని పోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే షెడ్ నిర్మాణం వెంటనే చేపట్టి అన్నపూర్ణ క్యాంటిన్ నిర్వాహణకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సాఫీగా అన్నపూర్ణ క్యాంటిన్ నిర్వహించుటకు షెడ్ నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ ని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎండాకాలం కాబట్టి ఐదు వందల గ్లాసుల మజ్జిగ ను మున్సిపల్ నిధుల నుంచి నిర్వాహకులకు అందించాలని చైర్మన్ కి ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాషా, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన విగ్రహా,ధ్వజస్థంభ ప్రతిష్టాపనలో డీసీసీ మాజీ అధికార ప్రతినిధి ధుశ్యంత్ రెడ్డి



**నవాబ్ పేట మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని జంగమయ్యపల్లి అభయాంజనేయ స్వామి విగ్రహ పున:ప్రతిష్ఠా మహోత్సవాల్లో మాజీ డీసీసీ అధికార ప్రతినిధి ధుశ్యంత్ రెడ్డి హాజరై ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద నూతన విగ్రహావిష్కరణ,నవ గ్రహ ప్రతిష్ట గణపతి ప్రతిష్ట ద్వజ స్థంభం ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దైవ భక్తి , ఆద్యాత్మిక చింతనతో ఉండాలని ఇలాంటి మహోన్నతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం శుభ పరిణామం అని అన్నారు.ఆలయ అభివృద్ధి కోసం ఐదు లక్షల రూపాయలు ప్రకటించి రెండు లక్షల రూపాయలు గ్రామ పెద్దలకు అందజేశారు.ఆలయ అభివృద్ధికి కృషి చేసిన గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచంద్రయ్య మాజీ అధ్యక్షుడు నర్సింహ చారి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాసు యాదవ్ సర్పంచ్ వెంకటేష్ యంపీటీసి నర్సింహులుభాగ్యమ్మ నీల్య నాయక్ కోట్ల రాజేష్ వెంకటేష్ గౌడ్ మల్లెష్ యాదవ్ బంక ఆంజనేయులు యాదవ్ రవిందర్ రెడ్డి గోపాల్ నాయక్ శంకర్ బంక వెంకటయ్య ఖాజామైనోద్దీన్ శ్రీహరి నర్సింహులు నీలకంఠ మాజీ ఎంపీటీసీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ రవి గ్రామ పెద్దలు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఒత్తిడికి ఉపశమనాలు - ఎంవిఎస్ ప్రిన్సిపల్ డా :కె పద్మావతి



**మహబూబ్‌నగర్ విద్యావిభాగం మేజర్ న్యూస్:** ఎమ్. వి. ఎస్ గవర్నమెంట్ డిగ్రీ, పిజి కళాశాల లో ఎమ్.వి.ఎస్ స్టాఫ్ క్లబ్ నిర్వహిచిన గతవారంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయలు, భోధనేతర సిబంది సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. పద్మావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డి, క్రికెట్ చేస్, వాలీబాల్ కళాశాల ఉద్యోగులకు నిర్వహించామని తెలిపారు. డాఎకె. పద్మావతి మంట్లాడుతూ, ప్రతి అకాడమిక్ సంవత్సరానికి ఒక వారం రోజుల పాటు భోధన, బోధనేతర సిబ్బందికి ఇలాంటి కార్యక్రమాలు ఆహ్లోదాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడలు పని భారం, మానసిక ఒత్తిడిని జయించి ఉపశమనాన్ని ఇస్తాయని అన్నారు. ఆటల ,పోటీలో గెలిచిన వారికి కళాశాల తరపున మెమెంటా ను అందజేశారు.. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ క్లబ్ కన్వినర్ కె. శివప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫసర్ ఆఫ్ ఎకనామిక్స్, ఫిజికల్ డైరెక్టర్ డాఎం సత్యభాస్కర్ రెడ్డి,బి.ఈశ్వరయ్య, డాఎం పి.రాములు, బి.సతీష్ రెడ్డి , అధ్యాపకులు పాల్గున్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

నాగర్‌కర్నూల్ జిల్లా : నాగర్‌కర్నూల్ టౌన్, అచ్చంపేట, టౌన్, రూరల్, చారగాండ, బల్మూర్, అమ్రాబాద్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు, తాడూరు, పేదర

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు

9059897456, 9440126456